

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



### (గత సంచిక తరువాయి)

**ఇద్దరూ బలమయినవాళ్ళు**, ఇద్దరికీ కుస్తీపట్లు తెలుసు. అందుకే తనని కదలకుండా నొక్కెయ్యగలిగారు. ఇక వ్యవధిలేదు. ఇంకో అరనిమిషం ఆలస్యం చేసినా తన ప్రాణం దక్కదు. రాజు తన బలం, ధైర్యం కూడదీసుకుని, రెండు పిడికిళ్ళూ బిగించి, స్ప్రింగులా చేసి ఒకడ్ని బలంగా తన్నాడు. పిడికిళ్ళతో రెండో అతన్ని గెడ్డం కింద కొట్టాడు. హఠాత్తుగా తగిలిన ఆ దెబ్బలకి వాళ్ళిద్దరూ చెరో ప్రక్కా క్రిందపడ్డారు. వెంటనే ఒక్క గంతులో లేచి నిలుచున్నాడు రాజు. వాళ్ళిద్దరూ కూడా లేచారు. ఇద్దరూ దాదాపు రాజంత పొడుగున్నారు, రాజుకన్నా లావు. నిప్పులు కక్కుతూ చూశారు రాజుని.

"ఏం చెయ్యగలవు?" అంటూ నేలమీద పడివున్న పిస్తోలుని తీసుకునేందుకు ఒకడు ఒంగాడు. రాజు ఒక్క ఎగురు ఎగిరి కాలితో అతన్ని తలమీద తన్ని, అదే కాలుతో పిస్తోలుని బీరువా కిందకి తోసేశాడు. రెండో అతను తన మీదికి రావడం ఓరకంటితో చూసి అతన్ని కణతమీద బలంకొద్దీ కొట్టాడు. ఆ దెబ్బకి స్పృహపోయి కిందపడ్డాడు అతను. పిస్తోలు తీసుకోడానికి వొంగిన మనిషి జేబులోకి చెయ్యిపోనిస్తున్నాడు. పిస్తోలు తీస్తాడా? రాజు తయారుగా వున్నాడు అతను పిస్తోలు తీస్తే మీదికి ఉరకడానికి. తళతళ మెరుస్తున్న కత్తి తీశాడు. నవ్వుకుంటూ రాజు అతని దగ్గరికే వెళ్ళాడు. రాజుని మెడమీద పొడవడానికి కత్తి పైకెత్తి రాజు మీదికి ఉరికాడు. సమయానికి రాజు చటుక్కున పక్కకి తిరగడంవల్ల కత్తితోపాటు కిందపడ్డాడతను. బూట్సుకాలు అతని చేతిమీద పెట్టి బలమంతా ఉపయోగించి గట్టిగా నొక్కాడు.

కెవ్వుమన్నాడతను. చెయ్యి విరిగింది.

"కత్తి వదులు. లేదా రెండో చెయ్యి కూడా విరుగుతుంది" గర్జించాడు రాజు.

అతను కత్తి వదిలేశాడు. రాజుతో పోట్లాడే స్థితిలో లేదు.

రాజు అతని రెండు జబ్బలూ పట్టుకుని మంచం దగ్గరికి లాక్కెళ్ళి ఎత్తి మంచమ్మీద పార్వతి పక్కనపడేశాడు. స్పృహపోయిన అతన్ని కూడా మంచం మీద పడేసి కదలకుండా యిద్దర్నీ మంచానికి బిగించి కట్టేశాడు. జేబురుమాలుతో చెమట తుడుచుకుంటూ "మీ ముగ్గురూ ఒకే ముఠాలోని వాళ్ళని నాకు తెలుసు. మీరెవరు? ఎందుకీ దౌర్జన్యాలు చేస్తున్నారు? ఉన్నది ఉన్నట్లు చెప్పాలి" అన్నాడు నవ్వుతూ.

"షటప్" అన్నాడు ఒకడు.

"నీలాంటివాళ్ళు వందమంది వచ్చినా నాచేత ఒక్కమాట మాట్లాడించలేరు" అన్నాడు రెండో అతను. పార్వతి మాట్లాడే స్థితిలో లేదు.

రాజు నవ్వుకున్నాడు. యుగంధర్ వుంటే ఒప్పుకోరు వీళ్ళకి బుద్ధి వచ్చేట్లు తను చేయదలుచుకున్న పని. లాబరేటరీలోకి వెళ్ళి కొన్ని సామానులు తెచ్చి మంచం పక్కన వున్న బల్లమీద పెట్టాడు. "ఇవేమిటో చూశారా?" అడిగాడు వాళ్ళని.

కళ్ళప్పగించి వాటిని చూశారు.

రెండు కత్తెరలు, గుండుసూదులు,బ్రష్, స్పిరిట్ లాంపు, సన్నని చిన్న రంపం.

"ఇవి మావికావు. నన్నూ, యుగంధర్‌గారినీ హింసించడానికి ఉపయోగించినవి. జ్ఞాపకార్ధంగా దాచి వుంచాం రెండేళ్ళనించీ. యీ రెండేళ్ళలో వీటితో మాకెపుడూ అవసరం రాలేదు. ఇది చూశారా! గుండుసూదుల బ్రష్. చెంపమీద దీన్ని నొక్కిపెట్టి లాగితే" అంటూ ఒకడి చెంపమీద గట్టిగా నొక్కాడు.

"రాక్షసుడా!" అరిచాడు అతను.

"ఈ సన్నని రంపంతో చెవి, ముక్కు, వేళ్ళు, గడ్డం కష్టం లేకుండా కొయ్యవచ్చు. కత్తితో కోస్తే అంత బాధ వుండదు.రంపంతో అయితే కొంచెం కొంచెంగా తెగుతుంది" అంటూ రంపం తీశాడు.

"మమ్మల్ని హింసించడానికి నీకెన్ని గుండెలు ఉన్నాయి?" అన్నాడొకడు.

"ఏం? ఇలాంటి పనిముట్లు ఉపయోగించడం నాకు తెలియదనుకున్నారా? చూద్దాం ముందు ఈ అందాల భరిణ నోటిలో గుడ్డలు తీసేసాను" అని పార్వతి నోటిలో గుడ్డలు తీసేసి "ఈ స్పిరిట్ లాంప్‌మీద ఈ కడ్డీలు వేడిచేసి, ఎర్రగా కాల్చి ఈ గులాబీ చెంపలమీద పెడితే" అంటూ స్పిరిట్ లాంప్ వెలిగించాడు రాజు.

ముగ్గురూ రెప్పవాల్చకుండా అతన్నే చూస్తున్నారు. ఒక కడ్డీ ఎర్రగా కాల్చి దాన్ని తీసుకుని పార్వతి దగ్గరికి వెళ్ళాడు. ఆ కడ్డీని చెంపకి  వెంట్రుకవాసిలో దాన్ని తీసుకుని పార్వతి దగ్గరికి వెళ్ళాడు. ఆ కడ్డీని చెంపకి వెంట్రుకవాసిలో పట్టుకుని నవ్వాడు.

కెవ్వున కేకపెట్టింది పార్వతి.

"ఏం? వద్దా?" అడిగాడు రాజు.

పార్వతి ఏడుస్తోంది.

"ఈ హింసలన్నీ మీరు పడాలని నేనసలేదే. నేనడిగే ప్రశ్నలకి మీరు సరిగా జవాబులు చెపితే ఏమో? మిమ్మల్ని పోలీసులకి అప్పగించకుండా వదిలేస్తానేమో?" అన్నాడు రాజు.

పార్వతి వాళ్ళిద్దరివేపూ దీనంగా చూసింది. "యితడు మనిషి కాదు రాక్షసుడు" అంది.

"కసి పెట్టుకున్నాడు. మనల్ని హింసించడం తనకి చాలా సంతోషంగా వున్నట్లు ఎలా నవ్వుతున్నాడో" అన్నాడొకడు రాజు కళ్ళల్లో మెరుపు చూసి బెదిరిపోయి.

"నువ్వు అడిగే ప్రశ్నలకి మేము జవాబులు చెబితే మమ్మల్ని హింసించవని యేమిటి రూఢి?"

ఏమీలేదు. నా మాట నమ్మాలి. అంతే" అన్నాడు.

"నీ మాటకి అంత విలువలేదు."

"ఏం! ఎప్పుడయినా నీతో మాట తప్పానా?" అడిగాడు రాజు నవ్వుతూ.

"మన వృత్తిలో మాటకి విలువ ఏముంటుంది?" అన్నాడు యింకో అతను.

ఫెడీమని అతన్ని చెంపమీద కొట్టాడు రాజు. "నీదీ, నాదీ ఒకే వృత్తికాదు. ధర్మమూ, న్యాయమూ, దేశభక్తి, దేశ క్షేమము యివన్నీ ఆలోచిస్తాను నేను. వీటితో సంబంధం లేకుండా స్వలాభం చూసుకోవడం మీ వృత్తి" అన్నాడు.

"నిజంగా పోలీసులకి అప్పచెప్పకుండా మమ్మల్ని వొదిలేస్తావా?" అడిగాడొకడు.

"ఆ విషయం వాగ్దానం చేయను."

"మనం చెప్పడం వల్ల మనకికానీ, మనవాళ్ళకి కానీ యింతకంటే నష్టం జరగదు" అన్నాడతడు.

"సరే చెపుతాము అడుగు" అన్నాడు రెండో అతను. రాజు ప్రశ్నలు అడగడం ప్రారంభించాడు.

యుగంధర్ బూట్సులు, మేజోళ్ళు విప్పేసి మేజోళ్ళని మడమలవరకూ చింపేశాడు. వాటిని బూట్స్‌కి తొడిగాడు.

చింపేసిన ముక్కలని హీల్స్‌కి మేజోళ్ళకి మధ్య దోపాడు. బూట్సులు వేసుకుని రెండడుగులు వేశాడు నెమ్మదిగా. బూట్స్ హీల్స్‌మీదా పోల్స్ మీదా మేజోళ్ళు వుండటం వల్ల అడుగు తీసి అడుగు పెట్టినప్పుడు యే మాత్రం చప్పుడు కావడంలేదు. చప్పుడు రాకుండా నడవడమే యుగంధర్ ఉద్దేశం. చప్పుడు కాకుండా ఉత్త కాళ్ళతో నడవవచ్చు కాని బూట్స్‌లతో అవసరం రావచ్చని అలా చేశాడు. నెమ్మదిగా ఏమాత్రం చప్పుడు కాకుండా గదిలోంచి బయటికి వెళ్ళాడు. మేడమీది అన్ని గదులూ చూసాడు. భార్గవప్రసాద్ వున్న గది తలుపు తెరిచాడు. ఆయన ఏదో అనబోతే మాట్లాడవద్దని చేత్తో సంజ్ఞ చేసి ఎట్లు దిగి వెళ్ళాడు కిందికి. క్రిందవున్న గదులన్నీ వెతికాడు. నళిని, లక్ష్మి, సత్యనారాయణ తప్ప యింకెవరూ లేరు. తరువాత వంటగదివేపు నడిచాడు. పొయ్యిమీద ఏదో ఉడుకుతున్న శబ్దం, లీలగా యింగ్లీషు పాట వినిపించాయి. ఏంజల్ పాడుతూ వంట చేస్తోంది. ఈ యింటిలో ఏంజల్ ఒకతేనా వున్నది. ఇంకెవరూ కనిపించలేదే అనుకుని వంటగది గుమ్మం పక్కన నిలుచున్నాడు. అయిదు నిమిషాలు, పదినిమిషాలు, పావుగంట ఓపికగా కాచుకున్నాడు. ఏంజల్ పాడనయినా పాడ్తోంది లేదా తనలో తాను మాట్లాడుకుంటోంది. యుగంధర్ అక్కడే నిలుచున్నాడు. కాస్సేపటిలో ఏంజల్ పాడటం మానేసింది. అయిదు నిమిషాలు పళ్ళాల చప్పుడు, గిన్నెల చప్పుడు బర్‌మని కాలింగ్ బజర్‌లాంటిది శబ్దం చేసింది.

"ఎస్! అయాం ఆల్‌రైట్" అంది ఏంజల్. బిగ్గరగా మళ్ళీ పాడడం ప్రారంభించింది.

యుగంధర్ వెనక్కి తిరిగి నళిని వున్న గదిలోకి వెళ్ళాడు. ఏంజల్ వంట గదిలో పాడుతోంది. నువ్వు వెళ్ళి చాటుగా వుండి ఆ పాట విను. ఆ పాట ఆ రాగం తెలుసుకో. వీలయినంతవరకూ ఏంజల్ కంఠస్వరంలా నీ గొంతు మార్చి పాడాలి. అప్పుడప్పుడు పాట మానేసి నిశ్శబ్దంగా వుండు. కాలింగ్ బజర్ శబ్దం కాగనే "ఎస్! అయామ్ ఆల్‌రైట్" అని మళ్ళీ పాడు. చెప్పాడు యుగంధర్ రహస్యంగా.

నళిని తల ఊపింది.

యుగంధర్ ఆమెని వెంటపెట్టుకుని మళ్ళీ వంటగదివైపు వెళ్ళాడు. గుమ్మానికి చెరొక పక్కనా ఏంజల్‌కి కనిపించకుండా నిలుచున్నారు. పది నిమిషాల తర్వాత నళినిని ప్రశ్నార్థకంగా చూశాడు యుగంధర్.

ఆమె తల ఊపింది.

యుగంధర్ తలవొంచి చుశాడు. ఏంజల్ వీపు గుమ్మం వైపు వుంది. చటుక్కున ఒక్క అంగలో లోపలికి వెళ్ళి వెనకనుంచి చెయ్యివేసి ఏంజల్ నోటిని నొక్కేసి రెండో చేతితో ఆమె చేతులని గట్టిగా పట్టుకున్నాడు. వెంటనే నళిని లోపలకి వచ్చి ఏంజల్ పాడిన యింగ్లీషు పాట పాడటం ప్రారంభించింది.

"ఆరీ! నిన్నేమీ చేయను భయపడక. నీకెటువంటి హానీ జరగదు" ఏంజల్ చెవిలో చెప్పాడు యుగంధర్.

ఏంజల్ గిలగిలలాడుతోంది. ఆమె నోటిమీదనించి చెయ్యి తియ్యకుండానే ఆమెని భుజం మీద వేసుకుని వంట గదిలోంచి వెళ్ళిపోయాడు యుగంధర్. తిన్నగా నళిని గదిలోకి పోయి ఏంజల్ నోటిమీద చెయ్యి అదిమిపెట్టి జేబులోంచి రుమాలు తీశాడు. రుమాలు తయారుగా పట్టుకుని ఏంజల్ నోటిమీదనించి చెయ్యి తీశాడు. చెయ్యి తియ్యగానే అరవడానికి ఏంజల్ నోరు విప్పింది. అరిచే అవకాశం లేకుండా తెరిచిన నోట్లో రుమాలు కుక్కేశాడు యుగంధర్. తరవాత ఆమె కదలకుండా చేతులూ, కాళ్ళూ కట్టేసి, అరవకుండా నోరు బిగించి. లక్ష్మి వున్న గదిలోకి వెళ్ళాడు.

"ఏంజల్‌ని బంధించాను. తప్పించుకుపోకుండా, అరవకుండా ఆమెని మీరు కనిపెట్టి వుండాలి. నేను తిరిగివచ్చేవరకూ మీరు ఆ గదిలోంచి కదలకూడదు" అని ఆమె చెవిలో రహస్యంగా చెప్పి ఏంజల్‌ని బంధించి వుంచిన గదికి లక్ష్మిని కాపలా పెట్టి యుగంధర్ తను నిర్ణయించుకున్న పని సాధించడానికి బయలుదేరాడు.

హాలుకి అవతల ఓ తలుపు. ఆ తలుపు మూసేసి వుంది. ఒక వైపున కిటికీలున్నాయి. రెండోవైపు కిటికీలు లేవు. కనుక అటువైపు యింకా కొన్ని గదులు వుండి వుండాలి అనుకున్నాడు యుగంధర్. మూసివున్న హాలు తలుపు లాగి చూశాడు. రాలేదు. అవతలవేపు గడియపెట్టి వుంటారనుకుని భోజనాల గదిలోకి వెళ్ళాడు. ఆ గదిలో వున్న రెండో తలుపు మూసి వుంది. అవతల యింకో భాగం వుందనీ, ఆ భాగంలో తమని బంధించినవాళ్ళు వుండి వుండాలనీ నిశ్చయించుకున్నాడు.

ఎంతమంది వుంటారు? లౌడ్ స్పీకర్‌లో మాట్లాడిన మనిషి అవసరమయిన పనిమీద వెళుతున్నానని చెప్పాడు. ఏంజల్ పాడినపాట ఆగిపోగానే బజర్ నొక్కినతను ఒకడున్నాడు. అతనొక్కడే వున్నాడా? ఇంకెవరయినా వున్నారా? తలుపు దగ్గర నిలబడి ఆలోచించాడు యుగంధర్. ఏమి ఉపాయం? ఎలా తలుపు తెరిపించడం, రెండు రెక్కలున్నాయి ఆ తలుపుకి. ఒక రెక్కకీ ఇంకో రెక్కకీ మధ్య కాగితం దూరే సందు కూడా లేదు.

యుగంధర్ వంటగదిలోకి వెళ్ళాడు .పాడుతూనే నళిని అతన్ని చూసింది.

"ప్లీజ్ కమ్ క్విక్ అయాం ఇన్ ట్రబుల్ అని అరవాలి నీవు. నేను యిక్కడనుంచి పోయిన రెండు నిముషాల తరవాత"  చెప్పాడామె చెవిలో. ఆమె తలవూపింది.

యుగంధర్ త్వరగా తలుపు దగ్గరకి పోయి తలుపు పక్కన గోడకానుకుని నిలుచున్నాడు. నళిని అరవడం విన్నాడు. చెవులు రిక్కించి వింటున్నాడు. తలుపు అవతల అడుగుల శబ్దం విని స్ప్రింగ్‌లా తయారయ్యాడు.  తలుపు తెరుచుకుంది. ఓ మనిషి వస్తున్నాడు. తలుపు దాటి అడుగు వేశాడో లేదో యుగంధర్ చెయ్యి పక్కకి వొంచి అతని మెడమీద ఒకే ఒక దెబ్బ కొట్టాడు. అది పాశుపతాస్త్రం లాంటి దెబ్బ. తగలవలసిన చోట తగిలిందా దెబ్బ. తిన్న మనిషి స్పృహ తప్పి కిందపడి కొన్ని గంటలవరకూ లేవలేదు.

యుగంధర్ అతని నాడి చూశాడు. రెప్పలు లాగి చూసి తరువాత అతని జేబులు వెతికాడు. పిస్తోలు దొరికింది. దాన్ని జేబులో పెట్టుకుని అతన్ని పక్కకి లాగేసి అతను తెరిచిన తలుపులోంచి అవతలకి వెళ్ళాడు. ఆ భాగంలో యితనొక్కడే వుండి వుంటాడు. ఇంకా కొంతమంది వుండి వుంటే నళిని అరుపు విని వాళ్ళూ వచ్చేవాళ్ళు. తను ఆ భాగం తీరికగా తనిఖీ చెయ్యవచ్చుననుకుని రెండడుగులు ముందుకి వేశాడో లేదో "బ్రిలియంట్ యుగంధర్. అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన యుగంధర్‌ని ఏక్షన్‌లో చూసే భాగ్యం కలిగింది నాకు. రియల్లీ బ్రిలియంట్. అటువంటి దెబ్బ కొట్టటం ఎలాగో తరవాత నాకు నేర్పుతారు కదూ. ప్లీజ్ ఒద్దు. ఆ పిస్తోలు అలాగే కిందకి వొంచి వుంచండి. మిమ్మల్ని కాల్చి చంపడం నాకు ఏ మాత్రం ఇష్టంలేదు" అన్నాడొకతను.

యుగంధర్ రెప్ప వాల్చకుండా అతన్ని చూసాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. తనకంటే రెండంగుళాలు పొడుగు. బూడిదరంగు సూటు వేసుకున్నాడు తెల్లని ఒళ్ళు పాశ్చాత్యుడు.

"ప్లీజ్ ఆ పిస్తోలు కింద పడేసి ఇలావచ్చి కూర్చోండి. నేను తలుపు మూసేస్తాను. తరువాత మనం సావధానంగా మాట్లాడుకోవచ్చు."

యుగంధర్ పిస్తోలు కిందపడేసి సోఫాలో కూర్చున్నాడు. అతను వీపు యుగంధర్‌వేపు తిప్పకుండా వెనక్కి నడుస్తూ వెళ్ళి తలుపు గడియపెట్టి వచ్చి యుగంధర్‌కి ఎదురుగా కాస్త దూరంలో నిలబడి "నేను చాలా జాగ్రత్తగా వుండాలి మీ దగ్గర. కొంచెం పొరపాటు చేశానా అయిపోతుంది" అంటూ నవ్వాడు. అతనిలో క్రౌర్యం లేదు. యుగంధర్ మీద ద్వేషంలేదు. గౌరవం మర్యాద స్ఫురిస్తున్నాయి.

"మీరెవరు?" అడిగాడు యుగంధర్.

అతను జవాబు చెప్పేలోగా 'కూ కూ ' అన్న శబ్దం వినిపించింది.

"నా టూవే రేడియో ఒక నిమిషం క్షమించండి" అంటూ అతను అవతల వున్న బల్ల దగ్గరికి వెళ్ళాడు. పిస్తోల్ యుగంధర్ మీద గురిపెట్టే వుంచాడు.

ఒక మీట నొక్కి "యస్! కాస్ మోస్ ఒన్ ఫోర్ నాట్ ఫోర్" అన్నాడు.

"జమినీ! ఫోర్ నాట్ ఫోర్ మెసేజ్."

"ప్రొసీడ్."

"ఆరు లక్షల రూపాయలిస్తే ఫిరోజ్ తెచ్చిన పత్రాలు ఇస్తానని టెలిఫోన్ద్వారా ఏ ఒన్కి కబురు వచ్చింది. ఒప్పుకుంటే ఎప్పుడు ఎలా డబ్బు ఇవ్వవలసిందీ, పత్రాలు ఎలా యిచ్చేదీ మళ్ళీ ఫోన్ చేసి చెపుతానన్నాడు. ఏ ఒన్ మీ అభిప్రాయం అడుగుతున్నాడు."

"నేనే వస్తున్నాను"అని ఓ మీట నొక్కి యుగంధర్ వేపు తిరిగి "ఆ పత్రాలు నిజంగా అతని దగ్గర వుండి, వాటిని మాకు ఆరు లక్షల రూపాయలకి అమ్మేస్తే అవి నా చేతికి వచ్చిన మరుక్షణం మిమ్మల్నందరినీ మీ యిళ్ళల్లో దింపేస్తాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు మీకందరికీ క్షమాపణలు చెప్పుకుంటాను. ఇప్పుడు నేను వెళ్ళాలి. దయచేసి నాకు అనవసరంగా ట్రబుల్ యిచ్చి మీరు ట్రబుల్ కావద్దు. మీ గదిలోకి వెళ్ళిపోండి" అన్నాడతను.

"స్పృహ లేకుండా పడివున్న అతని సంగతేమిటి?" అడిగాడు యుగంధర్.

"అతడిని యిక్కడికి, యీ గదిలోకి తెచ్చి పడుకోపెట్టండి."

"నేనందుకు అంగీకరించకపోతే?"

"అంగీకరిస్తారనే నా ఆశ" అన్నాడతను పిస్తోలు అటూ యిటూ ఆడిస్తూ.

యుగంధర్ సోఫాలోంచి లేచి, వెనక్కి తిరిగి తాపీగా తలుపు దాటి అవతలకి వెళ్ళాడు. గోడ దగ్గర పడున్న అతన్ని భుజం మీద వేసుకుని వచ్చాడు.

"థాంక్యూ మిస్టర్ యుగంధర్! ఆ సోఫాలో పడుకోబెట్టి మీరు వెళ్ళిపోండి" అన్నాడతను.

యుగంధర్ తలవూపి, భుజం మీదవున్న అతన్ని పడుకోబెట్టబోతున్నట్లు అతని కాళ్లకిందకి ఒక చెయ్యి పోనిచ్చి, యింకోచెయ్యి అతని వీపు కింద పెట్టి చటుక్కున పైకెత్తి ఆ స్పృహలేని మనిషిని తనకి కవచంగా ఉపయోగించుకుంటూ

పిస్తోలు పట్టుకున్న అతని మీదకి వురికాడు. పిస్తోలు పేలిస్తే గుండు యుగంధర్‌కి తగలదనీ, తన సహచరుడికి తగులుతుందనీ అతనికి తెలుసు.

"యుగంధర్! ప్లీజ్, డోంట్ బి పూలిష్" అన్నాడు.

స్పృహలేని ఆ మనిషిని పిస్తోలు పట్టుకున్న అతని మీద పడేశాడు యుగంధర్.

ఆ బరువుకి పిస్తోలు పట్టుకున్న అతను కిందపడ్డాడు. అతనిమిద స్పృహ లేని మనిషి పడ్డాడు. వెంటనే యుగంధర్ అతని చేతిలోంచి పిస్తోలు లాక్కుని "మీరు ఇప్పుడూ పూలిష్‌గా ప్రవర్తించకండి" అన్నాడు.

"యుగంధర్! ఏమిటి ప్రయోజనం? మీరు ఈ యింటిలోంచి బయటకి వెళ్ళలేరు. తోటలో పన్నెండు కుక్కలు కాపలా కాస్తున్నాయి.”

"పిస్తోలుందిగా!"

"నలుగురు మనుషులు పిస్తోళ్ళు పట్టుకుని కాపలా కాస్తున్నారు. తప్పించుకుపోలేరు."

"చూద్దాం."

(ముగింపు వచ్చేనెలలో)

Post your comments